# ప్రహ్లాదుని బోధన

## ప్రభవ్ పరిపాటి

కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి

దేవదేవునిఁ జింతించు దినము దినము / చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు / తండ్రి హరిఁ జేరుమనియెడి తండ్రి తండ్రి **(7.169)**

ఈ పద్యమున గల భావార్థాలంకారాలు అమోఘం, అద్భుతం, ఆశ్చర్యం, ఆరాధ్యం, ఆనందం. శ్రీ లక్ష్మీనాథునికి సేవచేసిన హస్తములే హస్తాలు, శ్రీనాథుని వర్ణించే జిహ్వ జిహ్వ, దేవతారక్షకుడైన విష్ణుని ధ్యానయోగాన చూచినవే చూడ్కులు, శేషశాయికి మ్రొక్కినదే శిరము, శ్రీవిష్ణుకథల నాలకించేవే చెవులు, హరికి అంకితమైనదే మనస్సు, భగవంతునికి ప్రదక్షిణగావించేవే పాదాలు, పురుషోత్తముని గూర్చి ఆలోచించేదే బుద్ధి, దేవదేవుని ధ్యానించేదే దినము, చక్రాయుధుని గూర్చి చదివినదే చదువు, పురుషోత్తమునిపైన నుంచిన బుద్ధే బుద్ధి, భూభర్తగు హరిని గూర్చి చెప్పినవాడే గురుడు. ఓ తండ్రీ! హరినిజేరుమనేవాడే తండ్రి! నీవు మాత్రం తండ్రి వెంత మాత్రం కావని ప్రహ్లాదు డెంత ఖరాఖండిగా చెప్పెను. ఈ పద్యమొక అమూల్య రత్నం. - ఈ వ్యాఖ్య శాంతిశ్రీ బొత్సకవి గారి "పోతన భాగవత రత్నాలు" అనే పుస్తకము నుండి గ్రహించబడినది.

ఈ కాలములో మానవులకు అశాంతి ఎక్కువగా ఉన్నదని చెప్పవచ్చును. చేసే పనులలోనూ, ఇంద్రియ సాంగత్యములోనూ, చింతనలోనూ భగవంతుని నిలిపిన - అట్టి అశాంతి తొలగునని, మోక్షప్రాప్తి కలుగునని ఈ పద్యము సూచించుచున్నది.